
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

శనివారం 25 అక్టోబరు 2025



ఐపీఎస్ అధికారి షెల్కే నచికేత్ విశ్వనాథ్‌కు ఎస్పీగా జిల్లాలో తొలి పోస్టింగ్. ఈ యువ అధికారి బాధ్యతలు చేపట్టి 40 రోజులు దాటింది. అప్పుడే తన మార్క్ పోలీసింగ్ చూపిస్తున్నారు. ముఖ్యంగా సొంత శాఖలో అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడడంతో పెండ్లిమర్రి, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐలపై వేటువేసి తప్పులు చేసేవారికి హెచ్చరికలు పంపించారు. పోలీసుశాఖలో అవినీతి బ్యాచ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇక జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి జిల్లా పరిస్థితులు, క్రైం ఇతరత్రా వాటిని ఆకళింపు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతికి ఎస్పీ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. (కడప-ఆంధ్రజ్యోతి)

- బెట్టింగ్, మట్కా నిర్వాహకులపై పీడీ యాక్టు
- పోలీసులు తప్పు చేస్తే కఠిన చర్యలు
- ట్రాఫిక్‌పై ప్రత్యేక ప్రణాళికలు
- కడప రిమ్స్‌ను సీక్రెట్‌గా విజిట్ చేస్తా
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు

ప్రశ్న: ఎస్పీగా వచ్చిన నెలలోపే ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేశారు. ఎందుకని..

జవాబు: పోలీసులకు క్రమశిక్షణ ముఖ్యం. తప్పుచేస్తే కఠిన చర్యలు తప్పవు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా, అవినీతికి పాల్పడినా సహించేది లేదు. పోలీసులంటే ప్రజల కోసం బాధ్యతగా పనిచేయాలి. పనిచేసేవారికి ప్రోత్సాహం ఉంటుంది. తప్పు చేసే వారిపై చర్యలు తప్పవు. పోలీసులకు క్రమశిక్షణ ముఖ్యం. వారి సంక్షేమం కోసం పాటు పడతా.

ప్రశ్న: మహిళల భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

జవాబు: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తా. ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలు చూస్తే.. అవి తెలిసిన వారి ద్వారా జరుగుతున్నవే. అందుకే పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తాం. మహిళలు, బాలికలు తమకు తెలిసిన వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి.

ప్రశ్న: భూకబ్జాలు జరుగుతున్నాయి..

జవాబు: భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఇష్యూ క్రైంకు దారి తీస్తుంది. ప్రభుత్వం కూడా దీనిపై సీరియస్‌గా దృష్టి పెట్టింది. కఠినమైన చట్టాలు ఉన్నాయి. ఏదైనా పోలీసుల దృష్టికి తెస్తే సివిల్ ఇష్యూ కాకపోతే కేసు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తాం.

ప్రశ్న: క్రికెట్ బెట్టింగ్, మట్కా, గంజాయి, గ్యాంబ్లింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

జవాబు: మట్కా, పేకాట, గ్యాంబ్లింగ్‌ను ఆర్గనైజ్డ్ క్రైంగా గుర్తించి నిర్వాహకులపై పీడీ యాక్టు నమోదు చేస్తాం. వీరిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం. కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందులపై ప్రత్యేక దృష్టి పెట్టి డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాం. పోలీసుల నిఘా ఉండడంతో ఇప్పుడు జిల్లాలో గంజాయి సరఫరా నిలిచిపోయింది. కొనుగోలుదారులు దొరికినా సరే కేసులు నమోదు చేస్తాం.



ప్రశ్న: పోలీసులే సెటిల్‌మెంట్లు, సివిల్ పంచాయితీలు చేస్తున్నారు

జవాబు: సివిల్ పంచాయితీలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

ప్రశ్న: కొందరు గంజాయి లేకుంటే మత్తు ఇచ్చే ట్యాబ్లెట్లు కొనుగోలు చేస్తున్నారు..

జవాబు: మెడికల్ షాపుల నిర్వాహకులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు కొనసాగిస్తే లీగల్ యాక్షన్ తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ప్రశ్న: రిమ్స్‌లో గంజాయి సరఫరా అవుతున్నట్లు ఆరోపణలున్నాయి.

జవాబు: రిమ్స్‌ను సీక్రెట్‌గా నేనే విజిట్ చేస్తాను. అక్కడ సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అధికారులతో సమావేశం నిర్వహిస్తాను.

ప్రశ్న: ఎర్రచందనం అక్రమ రవాణాపై..

జవాబు: ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాం. టాస్క్‌ఫోర్స్‌తో నిరంతరం నిఘా ఉంచాం. పలువురు ఎర్రచందనం స్మగ్లర్లపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం. ప్రతిపాదనలన్నీ సిద్ధం చేశాం.

ప్రశ్న: గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా సాగుతోంది..

జవాబు: మైనింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి ఓ సమావేశం ఏర్పాటు చేస్తాం. అందరం కలిసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అక్రమార్కులపట్ల కఠినంగా వ్యవహరిస్తాం.

ప్రశ్న: ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది

జవాబు: కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. ఇక్కడ ప్రజలు కూడా వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపకూడదు. ఆసుపత్రులు, హోటల్స్ ఇతరత్రా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. పార్కింగ్ ప్లేస్‌లలో మాత్రమే వాహనాలు నిలపాలి. అలా కాకుండా అడ్డంగా నిలిపితే కేసులు నమోదు చేసి రూ.5వేలు, రూ.10వేలు ఫైన్ వేస్తాం.



ప్రశ్న: ఎస్బీ, ఇంటెలిజెన్స్‌లో కొందరు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. ప్రక్షాళన చేస్తారా

జవాబు: ఎస్బీ, ఇంటెలిజెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెడతాం. ఎవరెవరు ఎన్ని రోజుల నుంచి పనిచేస్తున్నారో డేటా సేకరించి ముందుకు వెళతాం.

అమ్మో..!



చెరువు కట్ట వద్ద ఒరిగిన స్కూలు వ్యాను


ఈ ఫొటో చూస్తే ఎవరైనా అమ్మో.. అనాల్సిందే. గోపవరం మండలంలో శుక్రవారం ఒక ప్రైవేటు స్కూలు నుంచి పిల్లలను ఇంటికి తీసుకువచ్చే క్రమంలో సంద్రపల్లె చెరువు కట్టపైన వెళుతుండగా వ్యాన్ ఒకవైపు ఒరిగిపోయింది. ఆ సమయంలో వ్యాన్‌లో సుమారు 60 మంది విద్యార్థులు ఉన్నారు. స్థానికులు వ్యానులో నుంచి విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. వ్యాను ఇంక ఏమాత్రం ఒరిగినా విద్యార్థులందరూ చెరువులో పడేవారని స్థానికులు తెలిపారు. ఘటనాస్థలానికి రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో వ్యాన్‌ను రోడ్డుపైకి తెచ్చారు. విద్యార్థులను సురక్షితంగా వారి ఇళ్లకు పంపించారు.

- గోపవరం

బుగ్గవంక డ్యాం నుంచి నీరు విడుదల

- సాగునీరు అందించడమే లక్ష్యం : పుత్తా

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక డ్యాం నుంచి 500 క్యూసెక్కుల నీటిని శుక్రవారం రెడ్డిచెరువు, ఇప్పెంట, నత్తలకుంట, చింతకొమ్మదిన్నె చెరువులకు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుగ్గవంక ప్రాజెక్టులోకి 1600 క్యూసెక్కుల నీరు ఎగువ ప్రాంతం నుంచి వస్తోందని, దీంతో ఒకగేటు తెరచి 500 క్యూసెక్కులు చెరువులకు వదిలామన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, సీకేదిన్నె తహశీల్దారు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు టీవీ కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్, నరసింహులు, మునీంద్ర, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బుగ్గవంక డ్యాం గేటు నుంచి నీరు వదులుతున్న దృశ్యం

శనగ విత్తనాలకు రేపటి నుంచి రిజిస్ట్రేషన్

కడప రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసేందుకు శనగ విత్తనాలను 25 శాతం సబ్సిడీతో అందించేందుకు రిజిస్ట్రేషన్ నమోదును ఆదివారం నుంచి చేపట్టనున్నారు. రిజిస్ట్రేషన్‌కు కేవలం మూడురోజులు మాత్రమే గడువు ఇచ్చారు. సబ్సిడీ ధర పోను రైతులు చెల్లించాల్సిన వాటా డబ్బును క్యూ ఆర్ కోడ్ పద్ధతి ద్వారా మాత్రమే చెల్లించాలనే నిబంధన తీసుకొచ్చారు. రబీలో 1,80,000 ఎకరాలలో బుడ్డశనగ సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాకు 37 వేల క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి పంపిణీకి ఆదివారం నుంచి రిజిస్ట్రేషన్ చేపట్టనున్నారు. అదనంగా మరో 22 వేల క్వింటాళ్ల బుడ్డశనగ విత్తనాలు అవసరంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాగా.. జిల్లాలోని ప్రతి రైతు సేవా కేంద్రం సిబ్బందికి బయోమెట్రిక్ పరికరాలను పంపిణీ చేశారు.

ప్రైవేట్ బస్సులు భద్రమేనా?

కడప క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంతో మరోసారి ప్రైవేట్ బస్సుల భద్రత తెరపైకి వచ్చింది. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల నుంచి దాదాపు 200లకు పైగానే ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి. కడప నుంచి హైదరాబాద్, బెంగళూరు, విజయవాడకు ప్రతి రోజు ఇవి తిరుగుతుంటాయి. కడప నగరంలో సెవెన్ రోడ్స్ కూడలి వద్ద రాత్రి 9 గంటల నుంచే ప్రైవేట్ బస్సులు రోడ్డు పైనే పార్కింగ్ చేసి ప్రయాణికులను ఎక్కించుకుంటారు. దీంతో అక్కడ అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువ. కొన్ని బస్సులకు సరైన పత్రాలు ఉండవు. కొన్ని బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా ఎక్కడా తనిఖీలు చేయరు. ఇక పండగలకైతే అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా అడిగేవారే లేరు.

రవాణాశాఖ అధికారులు నగర శివార్లలో ప్రతిరోజు తనిఖీలు చేస్తుంటారు. కేవలం లారీలను మాత్రమే తనిఖీలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేసిన సందర్భాలు జిల్లాలో కనిపించడం లేదు. కర్నూలు ఘటనతో అయినా జిల్లా రవాణాశాఖ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై నిఘా ఉంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29న రాయచోటి పర్యటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. పేదలందరికీ ఇళ్లు గృహ ప్రవేశం కార్యక్రమం సందర్భంగా సీఎం రానుండటంతో శుక్రవారం రాయచోటి దిగువ అబ్బవరంలో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలసి చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్, ప్రజావేదిక, లబ్ధిదారుల గృహప్రవేశానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవి, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

ఆర్టీసీలో పదోన్నతుల జాతర

- ఉద్యోగుల్లో హర్షం

కడప మారుతీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): లక్షలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే సంస్థగా ఖ్యాతి గాంచిన ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులైన కండక్టర్లు, డ్రైవర్లు, పైస్థాయి అధికారులు, మెకానిక్స్‌కు పదోన్నతులు లేవు. వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిందే కానీ అందులో పనిచేసే సిబ్బంది. ఉద్యోగులకు గతంలో ఇచ్చే వెసులుబాట్లకు మంగళం పలికింది. దీంతో సంస్థ ఉద్యోగులు ఓ రకమైన నిరాశ, నిస్పృహలతో ఐదుసంవత్సరాలు గడిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఎందుకు విలీనం అయిందిరా బాబూ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. వారి సేవలను పరిగణనలోకి తీసుకున్న కూటమి సర్కారు దీపావళి రోజున అందులో పనిచేసే ఉద్యోగు లకు పదోన్నతులు కల్పించేలా జీవో ఎంఎస్ నెం.44ను తీసుకువచ్చింది. ఆర్టీసీలో పదోన్నతుల జాతరకు తెరలేవడంతో ఉద్యోగుల ముఖాల్లో సరికొత్త దీపావళి కాంతి నెలకొంది.



ఆరేళ్ల నిరీక్షణకు తెర

ఆరు సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడమే కాదు.. ఉద్యోగులకు డీఏ కూడా ప్రకటించడంతో వారు మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ మేరకు వైఎస్సార్ కడప ఉమ్మడి జిల్లాలో దాదాపు 470 మంది పదోన్నతులు పొందనున్నారు. కండక్టర్లు, డ్రైవర్లలో కంట్రోలర్‌లు, ఏడీసీలుగా దాదాపు 100 మందికి పదోన్నతి లభించ నుంది. అలాగే కంట్రోలర్ - ఏడీసీ నుంచి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లుగా 35మందికి, మెకానిక్స్, ట్రిమ్మర్, వెల్డర్, పెయింటర్స్ కోచ్ బిల్డర్లు తదితర కేటగిరీలలో సీనియారిటీ ప్రాతిపదికన 17మందికి (ఎల్‌హెచ్) లీడింగ్ హ్యాండ్ ప్రమోషన్లు ఇవ్వనున్నారు. మరో 29మంది అసిస్టెంటు మెకానిక్స్ నుంచి డిప్యూటీ మెకానిక్స్‌గా పదోన్నతి అందుకోనున్నారు. ఇదే కాక గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 ప్రమోషన్లు ఇవ్వడానికి జాబితా తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో డ్రైవర్లు 155మందికి, కండక్టర్లు 119మందికి, మెకానిక్స్‌కు 24మందికి, ఆర్టిజాన్స్ కేడరులో మరో 12మందికి గ్రేడ్-1 ప్రమోషన్లు రానున్నట్లు సమాచారం. మొత్తంగా కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడేలా చేసింది.

అండగా కూటమి సర్కారు..

పదోన్నతుల కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి సర్కారు అండగా నిలవడంతో ఉద్యోగుల కుటుంబాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. అధికారులు కొర్రీలు పెట్టకుండా ఉద్యోగులకు పదోన్నతులు పూర్తిస్థాయిలో లభించేలా చూడాలి. అంతేకాకుండా రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలు వెంటనే రిలీజ్ చేయాలి.



- కేకే కుమార్,
ఆర్టీసీ ఈయూ జోనల్ ప్రెసిడెంట్



పొంగిపొర్లుతున్న వాగులు



రాజుపాళెం మండలంలో రోడ్డుపై పారుతున్న మడమవంక

రాజుపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మడమ వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాజుపాలెం, గోపాయపల్లె, రాజుపాలెం టంగుటూరుకు రాకపోకలు బంద్ అయ్యాయి. కుందూలో 24వేల క్యూసెక్కులు నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వరద నీటిని తహశీల్దారు మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో రామనాథరెడ్డి పరిశీలించారు. వంకల్లో ఇబ్బందులు పడకుండా వాహనాలన కట్టడి చేసేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రబీలో సాగైన మినుము, నూగు, జొన్న పంటలు వర్షం ధాటికి నేలవాలాయి.

సగిలేరుకు జలకళ



ఉధృతంగా ప్రవహిస్తున్న సగిలేరు

కాశినాయన, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండ్రాజుపల్లె ఎస్సీ కాలనీ, నర్సాపురం పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంతాలు నీటమునిగాయి. స్థానికంగానే కాకుండా గిద్దలూరు పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి నర్సాపురంవద్ద సగిలేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

కుంగిన బ్రిడ్జి



కుంగిన లోలెవల్ బ్రిడ్జి

ముద్దనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏకధాటిగా కురిసిన వర్షానికి భారీగా నీరు రావడంతో జమ్మలమడుగు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో కాయన వంకలో ఉన్న లోలెవల్ బ్రిడ్జి కుంగిపోయింది. చాలా నెలలుగా బ్రిడ్జి కింద మట్టి కోతకు గురై నెర్రలు బారి ప్రమాదకరంగా ఉంది. ఈ బ్రిడ్జి నేషనల్ హైవే పరిధిలో ఉంది. అధికారులు స్పందించకపోవడంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వంకలో నీటి ప్రవాహంతో ఒకవైపు కుంగిపోయింది.

చెరువుకు గండి




మర్రిమానుకుంట చెరువుకు గండి పడి వృథాగా పోతున్న నీరు

అట్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని తెలుగుగంగ కాల్వకు పక్కనే ఉన్న మర్రిమానుకుంట చెరువుకు శుక్రవారం తెల్లవారుజామున గండి పడింది. అడవిలో కురిసిన వర్షం నీరు చెరువుకు చేరేందుకు తెలుగుగంగ కాల్వపై ఏర్పాటు చేశారు. 2022లో రూ.12 కోట్లతో వైసీపీ నాయకుడు పనులు చేపట్టారు. హైలెవెల్ వాల్‌కు ఇనుపరాడ్స్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకుండా పనులు చేశారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువు నిండడంతో అలుగు పక్కనే కాంక్రీటుతో నిర్మించిన వాల్ బద్దలై చెరువులోని నీరంతా తెలుగుగంగ కాల్వలోకి వెళ్లిపోయింది. వెంటనే సంబంధిత ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డికి ఫోను ద్వారా రైతులు తెలపడంతో ఆయన గండిని పూడ్చి మరమ్మతులు చేపడతామన్నారు. కానీ శుక్రవారం సాయంత్రం అవుతున్నా డీఈ రాకపోవడంతో చెరువులో ఉన్న నీరు వృథాగా పోతోంది. దీంతో దాదాపు 110 ఎకరాలు సాగు చేసిన ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కుందూ పరవళ్లు

చాపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండలంలో కుందూ నది పరవళ్లు తొక్కుతోంది. పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి భారీగా వరదనీరు నదిలో చేరుతోంది. శుక్రవారం కుందూ నదిలో 35 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు కేంద్ర జలసంఘం కార్యాలయ ఇంజనీరు తెలిపారు. సీతారామపురం, మదూరు గ్రామాల వద్ద ఉన్న కుందూ నదిపై నిర్మించిన బ్రిడ్జీలపై నీరు పొర్లి ప్రవహిస్తోంది. కుందూ నదిలో ఎవరూ దిగవద్దని తహశీల్దారు రమాకుమారి ప్రజలను హెచ్చరించారు. సీతారామపురం, మదూరు గ్రామాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తహశీల్దారు గ్రామనౌకర్లను నియమించారు.



సీతారామపురం గ్రామం వద్ద బ్రిడ్జీపై పారుతున్న నీరు

అమ్మో.. రోడ్డు..!



శివాలయం వద్ద దెబ్బతిన్న రోడ్డు..

సిమెంటు రోడ్డుపై తారు వేసినా ఏర్పడిన గుంతలు

ఇద్దరి ప్రాణాలు బలి తీసుకున్న యూటర్న్ ఇదే..

పట్టణంలోని రోడ్లు నరకానికి నకళ్లుగా మారడంతో వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా లేనివారి ప్రాణాలు గాలిలో కలసి పోతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశాబ్దాల క్రితం రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు నుంచి వెంకయ్య స్వామి ఆలయం వరకు ప్రధాన రోడ్డును విస్తరించడంతోపాటు, సిమెంటు రోడ్డు, మధ్యలో డివైడర్ కూడా ఏర్పాటు చేశారు. అయితే, పనులు నాసిరకంగా చేయడంతో పూర్తైన కొంత కాలానికే అవి దెబ్బతినడం ప్రారంభించాయి. వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్న విషయాన్ని అధికారులతోపాటు, నాయకులూ పట్టించుకోకపోవడంతో చీలికలు పెద్దవై గోతులుగా మారాయి. ఈ విషయం గమనించకుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులందరూ ప్రమాదంబారిన పడి గాయాలపాలయ్యారు.

వర్షం కురిసినప్పుడు ఈ ప్రమాదాల సంఖ్య మరీ అధికంగా ఉంటుంది. ఈ గోతుల కారణంగా అదుపు తప్పి పడిపోయిన ద్విచక్ర వాహనదారులు అదే మార్గంలో వేగంగా వెళుతున్న లారీల కింద పడి మృతి చెందిన సందర్భాలు కూడా ఉన్నా యి. ఇటీవల పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన బొక్కసం మహేంద్ర అనే యువకుడు నడుపుతున్న బైక్ యాక్సిస్ బ్యాంకు సమీపంలోని రోడ్డుపై ఉన్న గుంత కారణంగా అదుపుతప్పి కింద పడగా, వెనుక నుంచి వస్తున్న లారీ అతనిమీదుగా వెళ్లి పోయింది. పట్టణంలోని బలిజ వీధికి చెందిన నరేంద్ర అనే ఆర్ఎంపీని యూటర్న్ తీసుకునే క్రమంలో వేగంగా వచ్చిన ఓ ప్రైవేటు అంబులెన్సు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా ఈ ఏడాది వ్యవధిలో ఈ రోడ్డుపై ప్రమాదాల కారణంగా పది మంది మృతి చెందారు. సుమారు 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు నుంచి తులసీ స్కూలు వరకు, హోండా షోరూం, టీవీఎస్ షోరూం, లక్ష్మీపార్వడైజ్ సినిమా హాలు, సుజుకీ షోరూం, యాక్సిస్ బ్యాంకు ఎదురుగా, శివాలయం తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్డుకు ఈ మధ్య కాలంలోనే మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోతోంది. పట్టణంలోని హీరో షోరూం ఎదురుగా ఏర్పాటు చేసిన యూటర్న్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యి. కాగా ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు కూడా.

వాహనాల రద్దీతోనే..

పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాల్లో అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు ఎక్కువగా సాగవుతాయి. పట్టణానికి పక్కనే ఉన్న మంగంపేట గ్రామం వద్ద బెరైటీస్ గనులు ఉన్నాయి. ఇక అతి సమీపంలోనే తిరుమల క్షేత్రం ఉంది. సమీపంలోనే చెన్నై హార్బరు కూడా ఉంది. ఈ నేపథ్యంలో కార్లు వంటి చిన్న వాహనాలతో పాటు, వందలాది టన్నుల బరువైన యంత్రాలను తరలించే భారీ వాహనాలు సైతం ప్రతి రోజూ పెద్ద ఎత్తున రైల్వే కోడూరు పట్టణంలోని రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటాయి. ఈ వాహనాల ఒత్తిడి కారణంగానే రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, బైపాస్ రోడ్డు నిర్మించి పట్టణంలో వాహనాల రద్దీని తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

బైపాస్ రోడ్డు లేకనే ప్రమాదాలు



పెద్ద, పెద్ద వాహనాలు వెళుతుండడంతో రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.ఎంత అప్రమత్తంగా ఉన్నా ప్రమాదాలు జరుతుగూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతలు పూడ్చడంతోపాటు, బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

- మందల సుబ్రహ్మణ్యం, రైల్వే కోడూరు

ప్రమాదాలను అరికట్టాలి



ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి, ద్విచక్ర వాహనదారులు చనిపోతూనే ఉన్నారు. రోడ్లు గత ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో.. ప్రస్తుతం కూడా అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని రోడ్లను బాగు చేయాలి.

- మోతీలాల్, రైల్వే కోడూరు

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

- ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి విద్యాసాగర్

రాయచోటి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ ఆలపాటి విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నేతాజీ సర్కిల్ మీదుగా బస్టాండు వరకు ఉద్యోగులు, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 13 జిల్లాలకే పరిమితమైన ఏపీ ఎన్జీవో సంఘం కమిటీలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ సంఘాలను పిలిపించి డీఏ, హెల్త్ కార్డులు, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇన్సూరెన్స్, ఉద్యోగినులకు ఛైల్డ్ కేర్ లీవ్ వాడుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. మూడేళ్లుగా ప్రమోషన్లు లేక ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్ర యంత్రాంగానికి, చీఫ్ సెక్రటరీకి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గత ఆరేళ్లుగా ఉద్యోగులు చీకటి యుగంలో మగ్గారని తెలిపారు. గత ప్రభుత్వం 3600 మందిపై కేసులు బనాయించిందన్నారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.32,500 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తొలగిం చిన 950 మంది ఎంపీహెచ్ఏలకు న్యాయం చేయాలని కోరామన్నారు. ఏపీఎన్జీవో సంఘ కమిటీలను గ్రామ స్థాయిలో సైతం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్, ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నిత్య పూజయ్య, అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు, రమేశ్, తిరుపతి అధ్యక్షుడు సురేశ్, కడప తాలూకా అధ్యక్షుడు చిన్నయ్య, కోశాధికారి నాగార్జున, ఉపాధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరారెడ్డి, జాయింట్ సెక్రటరీ మోహన్‌రెడ్డి, రాయచోటి ఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి మహదేవ, కోశాధికారి దేవేంద్ర, ఉమెన్ వింగ్ ఛైర్మెన్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో బీహార్ జడ్జి

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అరుణ్‌కుమార్ జహ శుక్రవారం హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు అధికారులు గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ మేరకు తహసీల్దార్ బావాజాన్, బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి స్వాగతం పలికారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ములకలచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాలువపల్లె పంచాయతీ బుద్దలవారిపల్లెకు చెందిన మంచినీళ్ల నరసింహులు(64), మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వలేదన్న కోపంతో ఈ నెల 7 న గడ్డి మందు తాగాడు. తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య కదిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

హోటళ్లలో 'ఆహార భద్రత' తనిఖీలు



ఓ హోటల్ వంటశాలలో తనిఖీలు చేస్తున్న ఆహార భద్రత అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా అధికారులు, మున్సి పల్ అధికారులతో కలసి తనిఖీలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా ఆహార భద్రతా అధికారి కేఎస్ బాషా ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని గోంగూర, సంతృప్తి, ఆంధ్ర స్పైస్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పిట్టాస్ బావార్చి, రెడ్ బకెట్ బిరియాని, కేఎఫ్‌సీ తదితర హోటళ్లలో, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గదులతో పాటు, ఆహారం వడ్డించే ప్రదేశాల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. కొన్ని హోటళ్లలో అపరిశుభ్రంగా ఉండటంతో నోటీసులు జారీ చేసినట్లు కేఎస్ బాషా తెలిపారు. మిగిలిన హోటళ్ల నిర్వాహకులకు తగు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

ఘాట్ రోడ్డులో నేలకొరిగిన వృక్షం

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హర్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద శుక్రవారం ఓ భారీ వృక్షం నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండ చరియల్లోంచి వస్తున్న నీరు ఘాట్ రోడుపై ప్రవహిస్తోంది. ఈ ప్రవాహం కారణంగా వృక్షాలు కూలిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

అనాథ మృతదేహం చెంగల్రాయులుగా గుర్తింపు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం సమీపంలో గురువారం రాత్రి మృతి చెందిన వ్యక్తి పలమనేరు మండలం, గంగవరం, పాతూరుకు చెందిన చెంగల్రాయులు (64)గా గుర్తించారు. ఆయన కుటుంబసభ్యులు శుక్రవారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. వారి కథనం మేరకు తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లెలో ఉన్న కూతురు భారతి ఇంటికి వెళుతున్నట్లు చెప్పి ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిన చెంగల్రాయులు కూతురి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో సీటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఆయన భార్య కాంతమ్మ ఆస్పత్రికి చేరుకుని మృతి చెందినది తన భర్తేనని గుర్తించారు.

'మద్యం కేసు నిందితుడు మాజీ సైనికుడు కాదు..!'

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ పోలీసులకు బుధవారం మద్యంతో పట్టుబడింది మాజీ సైనికుడు కాదని మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్దకు వచ్చిన ఆయన మాట్లాడుతూ 41 సీసాల మద్యంతో పట్టుబడిన రమేశ్ అనే వ్యక్తి మాజీ సైనికుడు కాదని, అసలు తమ డివిజన్‌లో అతని పేరు నమోదు కాలేదన్నారు. ప్రజలను అధికారులను తప్పుదోవ పట్టించేందుకు ఇలా చెప్పి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

వరి పొలాలపై అడవిపందుల దాడి

సుండుపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి మళ్లలో పందుల స్వైరవిహారంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం రాత్రి కటారు ముడుకుకు చెందిన నరసప్పనాయుడు, మద్దిలేటి నాయుడు, అయ్యలవారిపల్లెకు చెందిన సుబ్బరాములతో పాటు మరికొంత మంది రైతుల పొలాల్లో అడవి పందులు దాడి చేసి నష్టపరిచాయి. శుక్రవారం వ్యవసాయశాఖ సిబ్బంది రాధమ్మ ఆయా పొలాలను పరిశీలించారు.ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు. నష్టనివారణ కోసం ప్రభుత్వానికి మంజూరు చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



పీలేరు: డివైడర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ములకలచెరువు, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా ము గ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పాత ములకలచెరువు పంచాయతీ దుగుసానివారిపల్లెకు చెందిన ఆంజనేయులు కుమారుడు అనిల్ కుమార్(28), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలపల్లెకు చెందిన సునీల్(24)తో కలసి గురువారం రాత్రి ద్విచక్ర వాహ నంలో ములకలచెరువుకు వస్తుండగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని ఇరానీ చాయ్ దుకాణం వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సునీల్‌ను మదనపల్లెలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సోనియా, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

వాల్మీకిపురం : పీలేరు పట్టణంలోని పద్మావతి నగర్‌కు చెందిన ఎస్.సయ్యద్ బాషా(45) ట్రాక్టర్ ఇంజన్‌తో వాల్మీకిపురం మండలం చెరుకువారిపల్లె సమీపంలో రాంగ్ రూట్‌లో వెళుతుండగా చెన్నైకి వెళుతున్న బొలెరో వాహనం ఎదురుగా వచ్చింది. రెండు వాహనాల డ్రైవర్లు వాహనాలను అదుపు చేయలేకపోవడంతో డివైడర్‌ను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సయ్యద్‌బాషా, బొలెరో వాహనంలోని శ్రీనివాసమూర్తి, శివశంకర్ రెడ్డిలను పీలేరు ఆస్పత్రికి తరలించారు. సయ్యద్‌బాషా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్టు

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం అక్రమ రవాణా కేసుల్లో కడప జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందిన చీంపర్తి ఫక్రుద్దీన్ (గోరేసాబ్ ఫక్రుద్దీన్/పొంగోడు) ను పీడీ యాక్టు కింద నిర్బంధించడాన్ని నిర్ధారిస్తూ ప్రభుత్వం శుక్ర వారం ఆదేశాలు జారీ చేసింది. ఎర్రచందనం స్మగ్లర్ ఫక్రుద్దీన్‌ను పీడీ యాక్టు కింద నిర్బంధించాలని గత నెల 2న కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే అతనిపై 8 వేర్వేరు రకాల కేసులుండగా, గతంలో పీడీ యాక్టు కింద ఒకసారి నిర్బంధిం చినా, విడుదలయిన తర్వాత అక్రమ రవాణా కార్యకలాపాలను కొనసాగించాడని, అతనిని పీడీ యాక్టు కింద నిర్బంధించడం వినా మార్గం లేదని కలెక్టరు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను గత నెల 11న ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్బంధించిన అనంతరం మూడు వారాల్లోగా పీడీ యాక్టు కింద ఏర్పాటయిన రాష్ట్ర న్యాయ సలహా బోర్డు విచారించి నిర్బంధాన్ని సమర్థించాల్సి ఉంది. ఈ మేరకు సెప్టెంబరు 26న ముగ్గురు సభ్యులతో కూడిన సలహా బోర్డు ఫక్రుద్దీన్‌తోపాటు, విచారణాధి కారిని వీడియో కాన్ఫరెన్సు ద్వారా విచారణ చేసింది. అతనిని నిర్బంధించడానికి కారణాలను, ఆధారాలను పరిశీలించిన సలహా బోర్డు.. కలెక్టరు చర్యలను, ప్రభుత్వం ఆమోదాన్ని సమర్థిస్తూ నివేదిక అందజేసింది. దీంతో ఈ ఏడాది సెప్టెంబరు 5 నుం చి 12 నెలలపాటు పీడీ యాక్టు కింద నిర్బంధించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

లీజు గడువు ముగిసినా.. కొనసాగుతున్నారు

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దచెరువు లీజు గడువు ముగిసినా ఇప్పటికీ గత వేలం దారులే కొనసాగుతున్నారని పోతుపేట పంచాయతీ పిడుంవారిపల్లె గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పెద్ద చెరువులో చేపలు పట్టుకునే హక్కులు దక్కించుకున్నవారు.. గడువు ముగిసినా ఇప్పటికీ కొనసాగుతున్నారని ఆరోపించారు. చెరువులోకి తమ గ్రామస్తులను రానివ్వకపోగా.. కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు దీనిపై పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

పిడుగుపాటు బాధిత కుటుంబానికి పరిహారం

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలం నూతనకాల్వ పంచాయతీ నడింపల్లెకు చెందిన పిడుగుపాటు బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కుటుంబానికి చెందిన జోతా నాగరాజు గత ఏడాది అక్టోబరు 20న పిడుగుపాటుకు గురై మరణించగా బాధిత కుటుంబానికి పరిహారంకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బాధిత కుటుంబానికి పరిహారం సొమ్మును వెంటనే చెల్లించాలని కలెక్టరును రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హౌస్‌బిల్డింగ్ సొసైటీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవమైన కమిటీ సభ్యులతో అఫిషియల్ పీఐసీ ప్రవీణ్‌కుమార్

మదనపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో- ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీమయ్యాయి. ఇందులో ఒకే ప్యానల్ నుంచి ఎనిమిది మంది సభ్యులు నామినేషన్లుదాఖలు చేశారు. శుక్ర వారం నామినేషన్ల ఉపసంహారణలో ఒక అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోవడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సొసైటీ కాలనీలోని సహకారశాఖ డివిజన్ కార్యాలయంలో ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. ఏకగ్రీవమైన సభ్యులు బి.మహేశ్‌కుమార్, ఎస్.రెడ్డెప్ప, కె.వీరవెంకటశివాజీ, బి.శివానంద నాయక్, కె.వెంకటాచలపతి, ఎస్.రెడ్డిషామీర్, యు. నరేష్ ఉన్నారు. శనివారం ఉదయం 10:30గంటలకు స్థానిక కార్యా లయంలో మదనపల్లె హౌస్‌బిల్డింగ్ సొసైటీ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికల జరగనున్నట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి, అఫీషియల్ పీఐసీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందులో రెండో వర్గం వివిధ కారణాలు చూపుతూ ఎన్నికలు ఆపేందుకు న్యాయస్థానానికి వెళ్లినట్లు చెబుతున్నారు.

'గుమ్మసముద్రం'తో రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై ప్రవహిస్తున్న గుమ్మసముద్రం మొరవనీరు

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మసముద్రం చెరువుకు రెండు వైపులా మొరవలున్నాయి. ప్రస్తుతం చెరువు నిండడంతో రెండు రోజులుగా కుడివైపు మొరవ నుంచి నీటిని వదిలారు. ఎడమ వైపు నుంచి నీరు విడుదలైతే హంద్రీనీవా కాల్వలోకి చేరి కాల్వ దెబ్బతింటుందన్న ఉద్దేశంలో అధికారులు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో నీరు మదనపల్లె బి.కొత్తకోట రహదారిపై ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. తహసీల్దార్ బావాజాన్ చెరువు వద్దకు చేరుకుని హంద్రీనీవా అధికారులతో మాట్లాడారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఎడమవైపు మొరవపై వేసిన ఇసుక బస్తాలను తొలగించి రెండు వైపులా నీటిని విడుదల చేశారు. దీంతో రాకపోకలు కొనసాగాయి. హంద్రీనీవా కాల్వలోకి నేరుగా మొరవ నీరు వస్తుండడంతో అధికారులు కాల్వ తెగిపోకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా మొరవ నీటిని, చెరువు అందాలను చూసేందుకు బి.కొత్తకోట పట్టణ వాసులు సహా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం గుమ్మసముద్రం చెరువు వద్దకు వస్తున్నారు.

చెరువులు, కుంటల పరిశీలన



మర్రిఒడ్డుచెరువు తూములను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారుల

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా మండలంలోని చెరువులు కుంటలను శుక్రవారం ఇరిగేషన్ డీఈ చెన్న కేశవరెడ్డి, జేఈ సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఇందులో భాగంగా టి.సదుం పంచాయతీ తుమ్మల చెరువుకట్ట రెండు మూడు చోట్ల ప్రమాదకరంగా మారినట్లు గుర్తించారు. మల్లెల గ్రామ సమీపంలో ఉన్న మర్రిఒడ్డు చెరువు మొరవ పోతుండడంతోపాటు, తూముల నుంచి నీరు వృథాగా పోతుండ డంతో గ్రామస్తుల సహకారంతో ఇసుక మూటలు వేయించి కట్టడి చేశారు. ఎక్కడైనా చెరువులు కుంటలు ప్రమాదకరంగా అనిపిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు అందు బాటులో ఉండి ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలని వీఆర్వోలు, వీఆర్ఏలకు ఆదేశించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీఓ ఢిల్లీ బాబు, మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, వీఆర్వో శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి నాగరాణి, మల్లెల సీనియర్ టీడీపీ నేత కుందిలి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన బేస్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్, పీడీ సోమశేఖర్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన పోరుమామిళ్లలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అరవింద్, ఓంప్రసన్న విజేతలుగా నిలిచారు. వీరు నవంబరు 8, 9 తేదీల్లో రైల్వేకోడూరులో నిర్వ హించనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్-17 విభాగంలో డీ. చందన విజయం సాధించి ప్రకాశం జిల్లాలో జరగబోవు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని



శరణ్య

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని శరణ్య ఎంపికైందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్‌పర్సన్ అమృత తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో ఈ నెల 23న నిర్వహించిన అండర్-17 బాలికల విభాగం బాడ్మింటన్ పోటీల్లో పి.శరణ్య పాల్గొని దన్నారు. ఆమె ప్రతిభ మెచ్చిన సెలెక్టర్లు నవంబర్ నెలలో రాష్ట్ర స్థాయి పోటీలకు చిత్తూరు జిల్లా జట్టు తరపున పాల్గొనేందుకు ఎంపిక చేశారన్నారు. శరణ్యను రెండో ఛైర్‌పర్సన్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ షెహనాజ్, పీఈటీలు అభినందించారు.

గురుకుల విద్యార్థినికి సూపర్ జీఎస్టీ అవార్డు



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సోమశేఖర్

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కలికిరి జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల పదవ తరగతి విద్యార్థిని కె.ఖ్యాతి రాష్ట్ర స్థాయి సూపర్ జీఎస్టీ అవార్డు కైవసం చేసుకుంది. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0పై ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డుకు ఎంపికయ్యింది. గత వారం కర్నూలులో సూపర్ జీఎస్టీపై జరిగిన సమావేశంలో ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవాల్సి ఉండగా, షెడ్యూల్‌లో మార్పుల కారణంగా అవార్డు ప్రదానం వాయిదా పడింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల నుంచి ఎంపికయిన 17 మంది అవార్డు విజేతలను అభినందించారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయంలో అవార్డులు అందజేశారు. దీంతోపాటు గురువారం కలెక్టరు ప్రశంసా పత్రం, జ్ఞాపిక, రూ.ఐదు వేల నగదు అందజేశారు. శుక్రవారం విద్యార్థినిని ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):స్థానిక బీటీ కళాశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా హ్యాండ్‌బాల్ బాల బాలికల జిల్లా జటన్లు ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజ, ఝాన్సీరాణి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన జట్లు గుంటూరులో బాలికల చాంపియన్‌షిప్, ఎన్టీఆర్ జిల్లాలో బాలుర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. శివ, క్రీస్తే, సంధ్య, ప్రసాద్, నరేష్‌బాబు, దిలీప్, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్, కిరణ్, రెడ్డివరప్రసాద్, మహేంద్ర, బాలజీ, తదితరులు పాల్గొన్నారు.

సురక్షయాప్‌తో నకిలీ, కల్తీ మద్యానికి చెక్

- కొన్నచోటే వినియోగదారుడు పరిశీలించవచ్చు
- స్కాన్‌చేయగానే బాటిల్ చరిత్ర ప్రత్యక్షం

బద్వేలుటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన మద్యం వినియోగదారుడికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మద్యం కొన్న వెంటనే దుకాణం వద్దే చెక్‌చేసుకునేందుకు వీలు కల్పించింది. ఈ క్రమంలోనే ఓ సరికొత్త యాప్‌ను తీసుకువచ్చింది. దీని ద్వారా వినియోగదారుడు తానుకొనే మద్యం అసలైందా లేక నకిలీ మద్యమా అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుంది. సురక్షయాప్ ద్వారా స్కాన్‌చేస్తే చాలు తాను కొన్న లిక్కర్‌బాటిల్ సంస్థ వివరాలు కస్టమర్స్‌కు కన్పించేలా ఈ యాప్‌ను రూపొందించారు. లిక్కర్ ధర.. ఎక్కడ తయారైంది.. ఏ బ్రాండ్.. ఏ డిపోనుంచి సప్లై చేశారు.. ఇలా అన్ని వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. ఇది ఏపీ ఎక్సైజ్ సురక్షయాప్. ఈ యాప్ ద్వారా అటు కష్టమర్లు తాము తాగేలిక్కర్ నాణ్యతను తెలుసుకునేందుకు, రీటేల్ దుకాణదారుడు అమ్మకాలు తెలుసుకోవడానికి ప్రభుత్వం దీన్ని తీసుకువచ్చింది.

సురక్షయాప్‌ను సులభంగా వాడవచ్చు

ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఎవరైనా సులభంగా వాడవచ్చు. కష్టమర్లు, ఆన్డ్రాయిడ్ సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఇన్‌స్టాల్ కాగానే కష్టమర్స్ రీటైల్ ఆప్షన్ చూపుతుంది. కష్టమర్ ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. తరువాత కష్టమర్స్ తాము కొనుగోలు చేసే లిక్కర్ బాటిల్‌పై ఉన్న స్టిక్కర్(అలోగ్రాప్)ను యాప్‌లోని స్కానర్ ద్వారా స్కాన్‌చేసి కింద సెక్యూరిటీ కోడ్‌ను ఎంపిక చేయగానే ఆ బాటిల్ వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ముఖ్యంగా ఆ మద్యం బ్రాండ్‌పేరు, ఆ బాటిల్ ఎంఎల్ సైజు, బ్యాచ్ ఐడీ, ఎమ్మార్పీ, తయారు చేసిన కంపెనీ వివరాలు, తేదీ, సమయం, అది ఏ లిక్కర్ డిపో నుంచి సప్లయ్ చేశారు వంటి వివరాలు క్షణాల్లో తెలిసిపోతాయి. ఒకవేళ స్కాన్ చేసిన వివరాలు నాట్‌ఫౌండ్ లేదా ఇన్‌వాలిడ్‌స్టాక్ అని వస్తే అది నకిలీ మద్యంగా భావించవచ్చు. కస్టమర్స్ ఫిర్యాదు చేయకుండానే ఆ వివరాలు ఎక్సైజ్‌శాఖ దృష్టికి వస్తాయి. ఈ సురక్షయాప్ వల్ల కష్టమర్స్ నకిలీ మద్యం బారి నుంచి కాపాడుకునేందుకు వీలు ఉంటుంది.



సురక్షయాప్ ద్వారా లిక్కర్ బాటిల్‌ను స్కాన్‌చేసి పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఎక్సైజ్ సురక్ష మొబైల్‌యాప్ ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాలు, బార్లల్లో నకిలీ మద్యం అమ్ముతున్నారనే వదంతులను ఎవరూ నమ్మవద్దు. కొందరు పనికట్టుకొని చెడుప్రచారం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రత్యేకంగా తీసుకువచ్చింది. దీనిని మొబైల్ ద్వారా వినియోగించుకోవచ్చు.

-ఎం.జయరాజ్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషన్ అధికారి

తక్షణం మెడిసిన్ అందుబాటులో ఉంచాలి

- విద్యార్థుల డిమాండ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఆరోగ్య కేంద్రంలో మెడిసిన్ లేకపోవడం సిగ్గుచేటని, తక్షణం మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం వైవీయూ ప్రధాన ద్వారం వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైవీయూ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు భరత్‌సింహ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని నెలలుగా మందులు అందుబాటులో లేవని, విద్యార్థులు కడప నగరానికి వెళ్లి సొంత ఖర్చులతో వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాలు, మెస్ పరిసరాల్లో అపరిశుభ్రత, స్నానాల గదుల్లో కొళాయిలు, తలుపులు లేని పరిస్థితి కారణంగా వ్యాధులు వ్యాపిస్తున్నాయని తెలిపారు. గ్రంథాలయం, ఆర్ట్స్ అండ్ కామర్స్ భవనం, వసతి గృహాలపై వైఫై సదుపాయం కల్పించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాగా, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో పెండ్లిమర్రి సీఐ దొర మధ్యవర్తిత్వం చేసి రిజిస్ట్రార్‌తో జరిపిన చర్చలు విఫలమయ్యాయని, త్వరలో అన్ని విద్యార్థి సంఘాలతో ఉమ్మడి కార్యాచరణ చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కిషోర్, గంగన్న, సాయికృష్ణ, ఉమర్‌బాష, బెంజమిన్, రాకేష్, నవీన్, ప్రభు, గణేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైవీయూ అధికారులు, పోలీసులు

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు శాస్త్రవేత్తలు మెరుగైన సేవలు అందించాలని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ తెలిపారు. మండలంలోని కొలుములపల్లె, ఇప్పెంట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతుల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని పంట ఖర్చును తగ్గించి ఆదాయ మార్గాలు పెంచాలన్నారు. ఈ ప్రాంతానికి అనుకూలమైన పంటల సరళితో మార్పు చేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కొలుములపల్లెలో వ్యవసాయం వైపు యువతను ఆకర్షించడం, నిలుపుకోవడం (ఆర్య పథకం)కింద సరఫరా చేసిన వర్మీకంపోస్టు యూనిట్లను, తమలపాకు తోటలను పరిశీలించారు. దేశవాలీ కోళ్ల పెంపకం ద్వారా రైతులు వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయం పొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా తిరుపతి, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో తెలుసుకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతితో కలిసి కేవీకే ఆధ్వర్యంలో ఉన్న పుట్టగొడుగులు, వర్మీకంపోస్టు, కోళ్లపెంపకం కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేశ్‌బాబు, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొలుములపల్లెలో రైతులతో మాట్లాడుతున్న శివనారాయణ

యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొనాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొనాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం కడపలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజనోత్సవాలు-2025లో భాగంగా విద్యార్థులకు ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ యువత చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కాగా, యువజనోత్సవాలలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పోటీలలో పాల్గొనేందుకు దాదాపు 485 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సెట్ప్ సీఈఓ జోయల్ విజయ కుమా ర్, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్, స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.



యువజనోత్సవాల సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

వర్షానికి కూలిన మిద్దె కప్పు.. మూడు గేదెలు మృతి



చాపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామంలో గురువారం రాత్రి మిద్దె పైకప్పు కూలడంతో మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామంలోని మార్తల ఓబుళరెడ్డి 30 ఏళ్ల క్రితం ఈ మిద్దెను నిర్మించారు. ప్రస్తుతం దీనిని పశువులపాకగా ఉపయోగిస్తున్నారు. రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురువడంతో మిద్దె పైకప్పు కూలి గేదెలు మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటాయని బాధితుడు తెలిపారు. చాపాడు పశువైద్య అధికారి మహమ్మద్‌గౌస్, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి మృతిచెందిన గేదెలను పరిశీలించారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు నివేదిక పంపుతున్నట్లు వీఆర్వో తెలిపారు.

ఎంఆర్ హోండా షోరూంలో బంపర్ డ్రా

- దసరా దీపావళికి యాక్టివా వాహనాలు కొన్నవారికి బహుమతులు



ఎంఆర్ హోండా దసరా లక్కీ డ్రా తీస్తున్న ఎండీ మహేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా దీపావళి సందర్భంగా ప్రొద్దుటూరులో ఎంఆర్ హోండా షోరూంలో యాక్టివా వాహనాలు కొన్నవారికి బంపర్ డ్రాలో బహుమతులు ప్రదానం చేశారు. శుక్రవారం మైదుకూరు రోడ్డులోని ఎంఆర్ హోండా షోరూంలో దసరా, దీపావళి బంపర్ డ్రా తీశారు. ఇందులో మొదటి బహుమతి కె.కొండారెడ్డికి యాక్టివా -125 కొన్నందుకు బంపర్ డ్రాలో 55 ఇంచుల గూగుల్ టీవీ , రెండో బహుమతి సి.నవీన్ యాక్టివా - 110 కొన్నందుకు రిఫ్రిజిరేటర్ అందజేశారు. మూడో బహుమతి వాషింగ్ మిషన్ అంద జేశారు. బంపర్ డ్రాను మేనేజింగ్ డైరెక్టర్లు మహేంద్రారెడ్డి, నరేంద్రారెడ్డి సమక్షంలో తీశారు. కార్యక్రమంలో షోరూం జనరల్ మేనేజర్ సందీప్ కుమార్, ఏజీఎం షేక్షావలి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ఎస్పీ స్పెషల్ డ్రైవ్



వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కడప నగరంలోని పలు కూడళ్లల్లో ఎస్పీ స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. సెవెన్‌రోడ్స్, క్రిష్ణ అప్సర, అంబేద్కర్, ఐటీఐ, ఊటుకూరు తదితర సర్కిళ్లలో జరుగుతన్న స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మైనరు డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, రికార్డులు లేనివాహనాలు, కంపెనీ ఫిట్టెడ్ సైలెన్సర్‌లను కాకుండా ఇతర సైలెన్సర్‌లను వాడడం, అనధికారికంగా సైరన్‌లను వాడేవారిపై, వివిధ శాఖల పేరుతో నకిలీ నెంబరు ప్లేట్‌లు కలిగి ఉన్న వారిపై, డ్రంకెన్ డ్రైవ్ , ఓవరు లోడింగ్, అతివేగంతో నడిపే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఎస్పీ తెలిపారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట పోలీసు అధికారులు ఉన్నారు.

నేను కష్టపడతా..మీరు కష్టపడండి

- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నేను కష్టపడతాను.. మీరు కష్టపడి పనిచేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయం పాలనలో పారదర్శకత, వేగం ఉండాలని, ఫైల్ క్లియరెన్స్ లో ఆలస్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పేపర్‌లెస్ ఆఫీస్ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలని ఆదేశించారు. తర్వాత ఆర్ట్స్ బ్లాక్‌ను పరిశీలించిన ఆయన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్ సందర్శించి విద్యార్థులతో సాంకేతిక అంశాలపై మాట్లాడారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార భద్రత పథకాన్ని అమలు చేయాలి

- వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్

కడప రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయిలలో జాతీయ ఆహార భద్రత, పోషణమిషన్ పథకాన్ని అమలు చేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా వ్యవసాయశాఖ సమావేశ హాలులో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులకు జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్‌పై శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత పోషణ మిషన్ పథకం ప్రయోజనాలను నెరవేర్చాలన్నారు. అనంతరం పథకాన్ని మండల, గ్రామ స్థాయిలో అమలు చేసే విధివిధానాలపై తెలియజేశారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అరుణాచలం క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం పులివెందుల డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 26, నవంబరు 2, 9, 16వ తేదీలలో పులివెందుల నుంచి ఉదయం 7గంటలకు అరుణాచలానికి బస్సు బయలుదేరుతుందన్నారు. నవంబరు 4వ తేదీ కార్తీక పౌర్ణమి రోజు ఉదయం 7గంటలకు పులివెందుల డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు వివరించారు. సూపర్ లగ్జరీ బస్సుకు రానుపోను చార్జీ రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో పాటు కార్తీకమాసంలో ప్రతి సోమవారం అక్టోబరు 26వ తేదీ, నవంబరులో 2, 9, 16వ తేదీలలో ఉదయం 6.30 గంటలకు శ్రీశైలానికి స్పెషల్ సర్వీస్ అల్ట్రా డీలక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు రాను పోను చార్జీ రూ.1280 అన్నారు.

నేడు పొలతల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

పెండ్లిమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం జరగనుందని ఆలయ ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఓ మాట్లాడుతూ చైర్మన్‌గా శిరిగిరెడ్డి రాజారెడ్డి, పాలక మండలి సభ్యులుగా 11 మంది ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిలు హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం కార్తీకమాస ఉత్సవాల ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులతో ఈవో చర్చించారు.

సీబీఆర్‌కు భారీగా వరద నీరు



సీబీఆర్ ప్రాజెక్టులో నీటి నిల్వ

లింగాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీబీఆర్‌కు భారీగా వరదనీరు చేరుతోంది. శుక్రవారం ఉదయానికి 500 క్యూసెక్కులతో ప్రారంభమైన వరద క్రమేపి 2500 క్యూసెక్కులకు పెరగ డంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇప్పటికే ప్రాజెక్టులో 9టీఎంసీల వరకు నీరు ఉండటంతో వరద మరింత పెరిగితే చిత్రావతి నదిలోకి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే సాయంత్రం వరద 1100 క్యూసెక్కులకు పడిపోవడంతో నదికి నీటి విడుదల వాయిదా వేశారు. ప్రాజె క్టు పూర్తిసామర్థ్యం పది టీఎంసీలు. ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ నరేంద్ర, ఎస్ఐ అనిల్‌కుమార్ ప్రాజెక్టును పరిశీలించి నది పరివాహక ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నదిలోకి నీటి విడుదల నిర్ణయం తీసుకుంటామని పీబీసీ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎల్ఎస్‌పీ డ్యాంకు....



డ్యాం నుంచి నీటి విడుదల

బి.కోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోయరు సగి లేరు ప్రాజెక్టు (ఎల్ఎస్‌పీ)కు నాలుగురోజుల నుంచి ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలకు అధికంగా నీరు వచ్చి చేరుతుంది. దీంతో శుక్రవారం ఇరిగే షన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి 1700 క్యూసెక్కులు దిగువకు సగిలే టికి వదలగా 250 క్యూసెక్కుల నీటిని బద్వేలు పెద్ద చెరువుకు విడుదల చేశామని తెలి పారు. వరద పెరిగితే దిగువకు నీటి విడుదల పెంచుతా మని, సగిలేటికి ఇరువైపులా ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఉధృతంగా సగిలేరుకు...



సగిలేరు ఆనకట్టపై వరదనీళ్లు

కలసపాడు,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువన గిద్దలూరు ప్రాంతంలోని నల్లమల అడవుల్లో నాలుగురోజుల పాటు కురిసిన వర్షాలతో సగిలేరుకు ఉధృతంగా వర్షపునీరు వస్తోంది. కలసపాడు మండల పరిధిలోని దిగువ తంబళ్లపల్లె వద్ద ఉన్న ఆనకట్ట ద్వారా కలసపాడు చెరువుకు నీరు చేరి నిండు కుండలా ఉంది. భారీ వర్షానికి మండలంలోని పలు చెరువులకు ఓ మోస్తరు వర్షపునీరు చేరింది. మండలంలో అక్కడక్కడ వరి మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గండికోటకు 1565 క్యూసెక్కులు..



గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెన్నా, చిత్రావతి నదులతో పాటు స్థానికంగా కురిసిన వర్షాల వల్ల వాగులు, వంకల ద్వారా శుక్రవారం గండికోట ప్రాజెక్టులోకి 1565 క్యూసెక్కుల వరదనీరు చేరినట్లు ఈఈ ఉమా మాహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా అవుకు రిజర్వాయిర్ నుంచి 500 క్యూసెక్కుల కృష్ణాజాలలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.207 టీఎంసీల నీటిమట్టం ఉంది.

పాపిరెడ్డిపల్లెలో పిడుగుపాటు

కాశినాయన అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపిరెడ్డిపల్లెలో గురువారం రాత్రి లక్ష్మీనరసయ్య అనే రైతు ఇంటి సమీపంలో పిడుగు పడింది. దీని ప్రభావంతో ఇంటి మెట్లభాగం నెర్రెలు బారింది. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. పిడుగుపాటుకు లక్ష్మీనరసయ్య ఇంటితో పాటు సమీప గృహాల్లోని విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు చాలా వరకు కాలిపోయాయి. వీధిలైట్లు కూడా కాలిపోయాయి.

నూతన బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్‌కు బోర్డు ఆమోదం హర్షణీయం

వేంపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ నూతన బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి రూ.2056కోట్ల అంచనాతో 110కిలోమీటర్ల మేర రైల్వే బోర్డు ఆమోదం తెలపడంపట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో కడప-రాయచోటి- మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గం మాటేమిటని ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతుల, వినియోగదారుల అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008-09 రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కడప-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ మార్గాన్ని మంజూరు చేసిందన్నారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఏఆర్, సివిల్ విభాగంలోని కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐ స్థాయి వరకు సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 'నేటి కాలంలో పోలీసుల విధి నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శివరాముడు, ఆర్‌ఎస్‌ఐలు స్వామినాయక్, వెంకటేశ్వర్లు, అప్పలనాయుడు, శ్రీనాథ్, చూడామణి వర్మ, ఏఆర్ ఎస్‌ఐ కొండారెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు..: అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ పరిధిల్లోని పలు విద్యాసంస్థల్లో, పాఠశాలల్లో 'లైంగిక నేరాల నుంచి మహిళలు,పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంచి ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించనున్నారు.

నీటి చౌర్యం, వృథాను అరికట్టాలి

పులివెందుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నీటిచౌర్యం, వృథా,అనధికార వాడుకలను అరికట్టాలని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, జలవనరుల శాఖ అధికారులతో కలిసి సాగునీటి సలహా మండలి సమావేశంలో జోగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయలసీమలో తాగునీటి అవసరాలు, రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకని సమావేశంలో చర్చించినట్లు జోగిరెడ్డి తెలిపారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి

కడప మారుతీనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప జోనల్ నాయకులు కోడూరు సుబ్బారావు, కడప డిపో కార్యదర్శి నగినాల శ్రీనివాసులు శుక్రవారం కడప పర్యటనకు విచ్చేసిన ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలను కోరారు. ఆ మేరకు కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వారిని కలిసి శాలువా, పూలబొకేలను అందించి మాట్లాడారు.

'బస్సు ప్రమాదానికి కేంద్ర, రాష్ట్రాలదే బాధ్యత'

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో జాతీయ, రాష్ట్ర రహదారులపై బస్సు ప్రమాదాలు పెరుగుతున్న ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అఖిలభారత అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు బి.విశ్వనాథ, ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌బాబు విమర్శించారు.ప్రైవేట్ బస్సుయాజమాన్యాలు నియమ నిబంధనలు పాటించక పోయినా అధికారులు కనీస శ్రద్ధ చూపడం లేదని, ప్రమాదాల తర్వాత మాత్రమే చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రివేళ నడిచే బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని పేర్కొన్నారు.ప్రమాదాల్లో మృతులైన వారికి కనీసం రూ.25లక్షల పరిహారం చెల్లించాలని, ప్రయాణికులకు ఉచిత ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కడపనాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్‌లు అన్నారు. శుక్రవారం కడపలో ఎద్దుల ఈశ్వర్‌రెడ్డిహాల్‌లో రైతు సంఘం నాయకులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కడప సెవెన్ రోడ్స్..: జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఎ.రామమోహన్ కోరారు. శుక్రవారం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం అందించాలి

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కడప నగర 48వ డివిజన్ ఏఎస్‌ఆర్ నగర్ బాధిత కుటుంబాలందరికీ ముంపు సమస్య తీరేంత వరకు ప్రతి పూట ఆహారం సరఫరా చేయాలని, నష్టపోయిన వస్తువులు, ఇళ్లకుపరిహారం చెల్లించాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప తహసీల్దార్ ఎంవీఎస్ నారాయణరెడ్డికి తహసీల్దార్ కార్యాలయంలో సీపీఐనాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి బి.శంకర్‌నాయక్, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు వ్యక్తిగత రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీయం గంగాధర్ తెలిపారు. శుక్రవారం కమలాపురం మండల సమాఖ్య 17వ వార్షిక మహాసభ సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండలసమాఖ్య 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రగతి గురించి అధ్యక్షురాలు చదివి వినిపించారు. అనంతరం అధ్యక్షురాలుగా సుమలత, కార్యదర్శిగా సుబ్బమ్మ, కోశాధికారిగా పాలకొండమ్మ, ఉపాధ్యక్షురాలిగా రహతున్‌కమిటీని ఎన్నుకున్నారు.

'హిందూ మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునే ప్రసక్తే లేదు'



హిందూ సంఘాల నాయకులను కళాశాలలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హిందూ మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునే ప్రసక్తే లేదని జిల్లా బీజేపీ నాయకుడు గజ్జెల వెంకటసుబ్బారెడ్డి, కమలాపురం అసెంబ్లీ కన్వీనర్ గుత్తిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అయ్యప్పమాల ధరించి కళాశాలకు వచ్చిన విద్యార్థిని మందలించి ఫైన్ వేయడంపై శుక్రవారం కళాశాల వద్ద బీజేపీ, హిందూ సంఘాల నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. దీంతో కళాశాల వద్దకు భారీగా బీజేపీ, హిందూ సంఘాల నాయకులు ఒక్కసారిగా రావడంతో పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా వారిని లోనికి పోనివ్వకుండా అడ్డుకున్నారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు కళాశాల లోపలికి కొంత మందిని పంపి ప్రిన్సిపాల్‌తో మాట్లాడించారు. ప్రిన్సిపాల్ క్షమాపణ చెప్పడంతో పాటు అయ్యప్పమాల ధరించిన విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని చెప్పారు. ఈ వివాదానికి కారణమైన కళాశాలలో పనిచేసే హెచ్‌వోడీని కూడా తొలగిస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో హిందూ సంఘాల నాయకులు శాంతించి అక్కడి నుంచి వెనుతిరిగారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, జనసేన, విశ్వహిందూ పరిషత్, ఏబీవీపీ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైవేలో తిరిగే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ ఏయాలని సీఐ క్రిష్టారెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఇర్కాన్ సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఏఎస్‌ఐలు ఆంజనేయులు, శంకర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పులివెందుల,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్‌లో సీఐ హాజీవల్లితో కలిసి డీఎస్పీ వాహనాల తనిఖీ చేపట్టారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తియాప్

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్ అని ఎస్‌ఐ శాంతమ్మ అన్నారు. శక్తియాప్‌పై మహిళలు, బాలికలకు యాప్ ప్రాముఖ్యతను వివరించడంలో భాగంగా శుక్రవారం నగరంలోని ఓ జ్యువెలరీ షాపులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

పులివెందుల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ వైసీపీ తలపెట్టిన ర్యాలీ పోస్టర్లను వైసీపీ నేతలు విడుదల చేశారు. శుక్రవారం స్థానిక వైసీపీ క్యాంప్ కార్యాలయంలో వైసీపీ ప్రజా ఉద్యమం పేరుతో పోస్టర్లను విడుదల చేశారు. మెడికల్‌కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28న నియోజకవర్గ స్థాయిర్యాలీ చేపట్టనున్నామని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలు పరిశీలన

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు నేలకొరిగిన వరిపై లీటరుకు 50 గ్రాముల ఉప్పును కలిపి స్ప్రేచేయడం వల్ల మొలకలు రాకుండా నివారించవచ్చని వ్యవసాయశాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని ఓబులంపల్లె, గుర్రంపాడు గ్రామ పంచాయతీలో మూడురోజుల క్రితం వర్షాలకు నేలకొరిగిన వరిని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు ప్రభాకర్‌రెడ్డి, సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, యాస్మిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పడిపోయిన వరిలో మొలక రాకుండా ఉప్పునీరు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీదేవి, వీఏఏ, సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు..: రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఊటుకూరు పరిశోధన శాస్త్రవేత్తలు పరిశీలించారు. తప్పెట్ల, చెరువుకిందపల్లె, పెద్దలేబాక గ్రామాల్లో వరి, మినుము పంటలను పరిశీలించారు. దెబ్బతిన్న వరి పొలంలో మొలకలు రాకుండా ఉండడానికి ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కె.సునీల్, సుబ్రహ్మణ్యం, యాస్మిన్, ఏఈవో సుబ్బనరసయ్య రైతులు పాల్గొన్నారు.



చెన్నూరు..గుర్రంపాడులో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

అక్రమ నియామకాలపై విచారణ చేయించాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో 2019-2024 మధ్య జరిగిన అక్రమ నియామకాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్‌కు ఆధారాలతో వినతిపత్రం అందించారు. వైస్ చాన్సలర్ స్పందిస్తూ విచారణ చేపడతామని స్పష్టం చేసినట్లు తెలిపారు.

పారదర్శకంగా క్రీడా ఎంపికలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప డివిజన్ స్థాయి క్రీడా ఎంపికలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూలు గేమ్స్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో కడప డివిజన్ స్థాయి క్రీడా పోటీల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు కడప డివిజను పరిధిలోని 9 మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో కబడ్డీ, చెస్. యోగా,బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడా ఎంపికలు జరిగాయి.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే కడపనగర అభివృద్ధి అని కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్‌లో మన కడప - స్వచ్ఛ కడప కార్యక్రమాన్ని ఐటీసీ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి, స్వచ్ఛత సాధ్యమవుతాయని పేర్కొన్నారు ప్రతిపౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తే కడప ఆదర్శ నగరంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, పాలకొండరాయస్వామి ఆలయ ఛైర్మన్ రెడ్డయ్య కార్పొరేటర్లు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన ఎమ్మెల్యే



ఎస్ఎస్ఏ అధికారులతో ఫోనులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండల విద్యాశాఖాధికారి, అగ్రికల్చర్, ఉపాధి, ఐకేపీ, ప్రభుత్వ ఆసుపత్రులను శుక్రవారం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి పరిశీలించారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా ఈ భవనాలు దెబ్బతినడంతో పరిశీలించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తిగా పరిశీలించారు. కనీసం వైద్యం కోసం వచ్చే రోగులు నిలబడడానికి చోటు లేకుండా ఉండడంతో ప్రజలు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా గదులన్నీ పరిశీలించించిన ఆయన వెంటనే డీఎంహెచ్‌వోకు ఫోను ద్వారా మాట్లాడారు. వెంటనే మరమ్మతులు చేయించాల న్నారు. తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో రఘురాం, మండల టీడీపీ ఇన్‌చార్జ్, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు



బోరెడ్డి జగన్నాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

వేంపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికి పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ నూతన డైరెక్టర్ బోరెడ్డి జగన్నాథరెడ్డి తెలిపారు. వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లెకు చెందిన జగన్నాథరెడ్డి హౌసింగ్ డైరెక్టర్‌గా నియామకమై శుక్రవారం విజయవాడలోని హౌసింగ్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. జగన్నాథరెడ్డిని వేంపల్లె మండల టీడీపీ పరిశీలకుడు రఘునాథరెడ్డి, బాలస్వామిరెడ్డి, ఎద్దుల శేషారెడ్డి, ఎద్దుల నారాయణరెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు చెల్లించాలి



మృతి చెందిన వారికి మౌనం పాటిస్తున్న అంజాద్‌బాష తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూల్ బస్సు దుర్ఘటనలో చనిపోయిన వారి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష డిమాండ్ చేశారు. అలాగే క్షతగాత్రులకు రూ.5లక్షలు పరిహారం చెల్లిస్తూ వారికి అవసరమైన వైద్యాన్ని ప్రభుత్వమే అందించాలని తెలిపారు. శుక్రవారం కడప నగరం డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.


గూగుల్ రాకతో యువతకు ఉపాధి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్ రాకతో రాష్ట్రంలో యువత కు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ తెలిపారు. శుక్రవారం కడప నగరంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్షయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు











వర్షాలతో జనాల పాట్లు

● ప్రొద్దుటూరులో చెరువులను తలపించిన రోడ్లు ● మైదుకూరులో ఇళ్లలోకి చేరిన నీరు ● పోరుమామిళ్లలో జలదిగ్బంధంలో ఆర్టీసీ బస్టాండ్


ప్రొద్దుటూరులో వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దారు గంగయ్య


వరద నీటమునిగిన బద్వేలు ఆర్టీసీ గ్యారేజ్


మైదుకూరులో ఇళ్లలోకి చేరిన వరదనీటిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రొద్దుటూరు పట్టణం జలమయమైంది. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షపునీరు ప్రధాన కాలువల్లో వెళ్లాల్సి ఉండగా కాలువలు పొంగి రోడ్డెక్కాయి. దీంతో పట్టణంలో గాంధీ రోడ్డు శివాలయం వీధి మైదుకూరు రోడ్డు కొర్రపాడు రోడ్డు జలమయమ య్యాయి. ఐదు ప్రధాన కాలువలైన మడూరు ఛానల్ ప్రొద్దుటూరు ఛానల్స్ -1,2, దొరసానిపల్లె ఛానల్, కొత్తపల్లె ఛానల్స్ ఆక్రమణకు గురికావడంతో చిన్నపాటి వర్షానికే కాలువలు నిండి రోడ్ల పైకి మురుగు నీరు ప్రవహించి బురదమయమవుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలో తహసీల్దారు కార్యా లయం, అగ్నిమాపక కార్యాలయం, ఎగ్జిబిషన్ మైదానం, కూరగాయ మార్కెట్ తదితర ప్రాం తాలన్ని వర్షపు నీటితో తటాకాలను తలపించాయి. బొల్లవరంలో ఎగువ పొలాల నుంచి వర్షపు నీరు పట్టణంలోకి రావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లుపడ్డారు. కాగా ఈ ప్రవాహాన్ని పరిశీలించిన తహసీల్దారు గంగయ్య వరదనీటిని కచ్చాకాలువలు తీసి మడూరు చానల్లోకి వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. అలాగే ఉప్పొంగి ప్రవహిస్తున్న ఉప్పొగు వంక ను పరిశీలించారు. శివాలయం సర్కిల్లోకి ట్రాఫి క్ సిగ్నల్స్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొన డంతో అవి పడిపోయాయి. దీంతో ట్రాఫిక్ సీఐ రాజగోపాల్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఈఈ శ్రీనివాసులు పరిశీలించారు. మైదుకూరు రోడ్డులో ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని పంచాయతీ, ఆర్ అండ్‌బి అధికారులను కమిషనర్ కోరారు.

చౌడేశ్వరినగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు

మైదుకూరు అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మైదుకూరులో కురుస్తున్న వర్షాలకు చౌడేశ్వరినగర్‌లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో నీరంతా నిల్చి ఇళ్లలోకి వచ్చాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని 4వ వార్డు టీడీపీ నాయకుడు ముడియం ప్రసాద్ అధికారులకు తెలియజేయగా తహసీల్దార్ చౌడేశ్వరినగర్ చేరుకొని యంత్రాలతో తాత్కాలికంగా కాలువల ను ఏర్పాటు చేసి నీటిని తొలగించే పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఏఈ నిరంజన్ రెడ్డి, పోలీసులు నీరు నిలువ ఉండే ప్రాంతాలను పరిశీలించి ప్రజలు అప్ర మత్తం చేశారు. కడప రోడ్డులో ఆక్రమణలను తొలగించి శాశ్విత పరిష్కారం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జలదిగ్బంధంలో ఆర్టీసీ బస్టాండు

పోరుమామిళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు వర్షపు నీటితో జలది గ్బంధమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో ఉపేంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డిలు రంగసముద్రం పంచాయతీ పరి .దిలోని స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న కాల్వల్లో పూడికను యంత్రాలతో తొలగించడంతో నీరు సాఫీగా వెళ్లింది. ఓ ప్రైవేటు స్కూలుకు వెళ్లే దారి పక్కన ఉన్న కాల్వ పూడిపోవడంతో ఆర్ అండ్‌బీ డీఈ సలీం, ఏఈ రజియా పోరుమా మిళ్ల పంచాయతీ కార్యదర్శి ఓబులేసులు ఈ కాల్వలను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

మడకలవారిపల్లె చెరువు అలుగు ఉధృతి

గోపవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా మడకలవారిపల్లె రాచెరువులో నీటి మట్టం గణనీ యంగా పెరిగి అలుగు ఉధృతంగా పారుతోంది. అలుగు వద్ద భారీగా ముళ్ల కంప పెరిగి నీటి ప్రవాహనికి ఆటంకం కలుగుతుంది. స్థానిక రైతులు మాట్లాడుతూ ముళ్లకంప కారణంగా నీటి ప్రవాహం అడ్డంకిగా ఉందని వర్షాలు ఇంకా పెరిగితే చెరువు పొంగిపోవడంతో పాటు కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు చెరువు కట్టను పటిష్టంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బద్వేలుటౌన్‌లో: బద్వేలు పట్టణం జలదిగ్బంధమైంది. గత మూడు రోజులు కురుస్తున్న వర్షాలకు అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. ముఖ్యంగా ఆర్టీసీ గ్యారేజ్, అటవీశాఖ కార్యాలయం, మైదుకూరురోడ్డు జాతీయ రహదారుల్లోని ఎస్‌బీఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ ల వద్ద చెరువులను తలపించేలా వర్షపునీరు, మురుగునీరు నిలబడటంతో వాహనదారులకు, పాదాచారులకు తిప్పలు తప్పడంలేదు. ఈ సమస్యకు శాశ్విత పరిష్కారం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఖాజీపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కిలేరు

ఖాజీపేటలో: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు రావడంతో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. కన్నెలవాగు చెరువు నిండి అలుగు పారడంతో రాకపోలకు ఇబ్బంది పడ్డారు. రావులపల్లె, పిచ్చిపాటిపల్లె, కుమ్మరరావుపల్లె గ్రామాలకు వక్కిలేరు వంక ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నామని, వర్షం వస్తే మా గ్రామాలకు నరకమే అన్నారు.

వరద పరిస్థితులపై ఎమ్మెల్యే సమీక్ష


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీలో వర్షాల కారణంగా ఏర్పడిన వరద పరిస్థితులపై ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడా కూడా నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని, ప్రతిరోజు బ్లీచింగ్ చేసి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. శానిటేషన్ పనులు చేయడానికి రోజువారీ ప్రణాళిక సిద్ధంచేసి పారిశుధ్య సమస్యలు లేకుండా స్వచ్ఛ మైదుకూరు చేయాలన్నారు. మార్కెట్ కూడలిలో అలుగు వంక కాలువ వెడల్పు చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ బాబు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర అధికారులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిపల్లెకు సీసీ రోడ్డు వేయండి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమిరెడ్డిపల్లె గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. చినుకు పడితే మట్టి రోడ్డు వెంట వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని గ్రామ ప్రజలు వాపోయారు. ఈ కూటమి ప్రభుత్వమైనా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సోమిరెడ్డిపల్లె గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముద్దనూరు అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ వెంటేశ్వరరావు సూచించారు.మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని సున్నపురాళ్లపల్లె క్రాస్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీలో పాల్గొన్న డీఎస్పీ వాహన చోదకులకు పలు సూచనలు చేశారు.,చట్టవిరుద్ధ కార్యకలాపాలు సాగిచేస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించా రు. సీఐ దస్తగిరి, పోలీసులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే శిక్ష తప్పదు

కలసపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే శిక్ష తప్పదని కలసపాడు ఎస్ఐ తిమోతి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండలంలో జరిపిన తనిఖీల్లో ఒకరికి రూ.10వేల జరిమానా, ఒకరికి 7 రోజు లు, మరొకరికి మూడు రోజలు జైలు శిక్ష కోర్టు విధించినట్లు ఆయన తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు.

గ్రామాలను సందర్శించినఎంపీడీవో

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రామాల్లో కురిసిన వర్షాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యం శానిటేషన్‌పై శుక్రవారం ఎంపీడీవో రామచంద్రారెడ్డి, మల్లేపల్లె, పలుగురాల్లపల్లె, ముడుమాల గ్రామాల్లో పరటించారు. అనంతర గ్రామంలోని ప్రజలతో మాట్లాడుతూ వర్షం నీటిని ఇళ్లముందు నిల్వకుండా పరిశుభ్రం చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

750 ఎకరాల్లో పంట నష్టం

పోరుమామిళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో 750 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మండలంలోని చెన్నారెడ్డిపేట, టేకూరుపేట, దమ్మనపల్లె ప్రాంతాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మొత్తం 750 ఎకరాలు వరి పైరు దెబ్బతిన్నదని తెలిపారు.

70 ఎకరాల్లో వరిపైరుకు నష్టం

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా పడుతున్న వర్షానికి ప్రొద్దుటూరు మండల పరిధిలో సుమారు 70 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ శాఖాధికారి సాంబవరాహరి కుమార్ తెలిపారు. మండల పరిధిలోని కల్లూరు, ఉప్పరపల్లె, చెన్నమరాజుపల్లె ప్రాంతాల్లో వరి పైరు తడిచి నేలవాలిందని చెప్పారు. శుక్రవారం వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమాచారం మేరకు ప్రాథమికంగా 70 ఎకరాల్లో వరిపైరు దెబ్బతిన్నట్లు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.

సబ్సిడీపై 1100 క్వింటాళ్ల బుడ్డ శనగ

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలానికి సబ్సిడీపై 1100 క్వింటాళ్ల బుడ్డశనగ విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వరాహరికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు సోమవారం నుంచి బుధవారం వరకు సబ్సిడీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. కిలో బుడ్డశనగ విత్తనాలకు రైతుల వాటాగా రూ.58.5 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్పీ విశ్వనాథ్‌ను కలిసిన ముక్తియార్



ప్రొద్దుటూరు , అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ ముక్తియార్ జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కలిశారు, శుక్రవారం కడపలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూ రులో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీని ముక్తియార్ కోరారు.

గుండంరాజుపల్లె బ్రాంచ్‌కెనాల్‌కు గండి

బి.కోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండంరాజపల్లె బ్రాంచ్ కెనాల్‌కు గురువారం రాత్రి గండి పడింది. పాయలకుంట్ల పంచాయతీలోని రామచం ద్రాపురంకు చెందిన ఒక రైతు కాల్వకు గండి కొట్టాడని ఆ గ్రామస్థులు తెలుపుతు న్నారు. ఈ విషయమై తెలుగుగంగ ఏఈ రాజేశ్‌కుమార్‌ను వివరణ కోరగా గుండం రాజుపల్లె బ్రాంచ్ కెనాల్‌కు రామచంద్రాపురంకు చెందిన ఓ రైతు గండికొట్టాడని తెలిసిందని, అతనిపై చర్యలు తీసుకుంటామని అలాగే గండిని పూడ్చి నీళ్ల వృథా కాకుండా చూస్తామని తెలిపారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యురాలు పర్యటన

ప్రొద్దుటూరు , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్ సభ్యురాలు విజయభారతి ప్రొద్దుటూరులో శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా విజయభారతిని ఆర్ఎస్ఎస్ నేతలు డాక్టర్ దస్తగిరి రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డిలు సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య ఆర్ఎస్ఎస్ భజరంగ్ దళ్ నేతలు పాల్గొన్నారు.

ఆగిన బస్సుతో ప్రజలకు ఇక్కట్లు

జమ్మలమడుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు కడపకు వెళ్లవలసి ఉండగా ప్రొద్దుటూరు కొత్త ఖాదర్‌బాద్ సమీపాన ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కాగా ఈ విషయమై డీఎం సుబ్బమ్మను వివరణ కోరగా సాంకేతిక కారణాలతో బస్సు ఆగిపోయిందని వెంటనే మరమ్మతులు చేసిపంపినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ముద్దనూరు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):మండల పరిధి ఒంటిగారిపల్లె సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.6మంది పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3660నగదు స్వాధీనం చేసుకొని చేసు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బద్వేలు పెద్ద చెరువును పరిశీలించిన ఆర్డీవో


బద్వేలు పెద్దచెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో, ఇరిగేషన్ అధికారులు

బద్వేలు/గోపవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పా టు బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి వచ్చే నీటితో నిండుతున్న బద్వేలు పెద్ద చెరువును శుక్రవారం ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. తహసీల్దార్‌తోపాటు ఇరిగేషన్ అధికా రులతో కలిసి చెరువును పరిశీలించి అధికారులతో నీటి మట్టాన్ని అడిగి తెలుసుకున్నారు. చెరువుకు నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా తగు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం మడకలవారిపల్లె పరిధిలోని రాచ్చెరువును, మున్సిపాలిటీ పరిధిలోని జలమయమైన రోడ్లు, నివాస ప్రాంతాలను ఆర్డీవో పరిశీలించారు. మహమ్మద్ కాలనీలో నిల్వ ఉన్న నీటిని భాకరా పేట చెరువులోకి వెళ్లేందుకు అవసరమైన పనులను చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఎక్స్‌కవేటర్ ద్వారా నీటిని తరలించారు. గోపవరం మండల పరిదిలోని చెరువులనుఆర్డీవో చంద్రమోహన్, ఇరిగేషన్ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి, బద్వేలు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, గోపవరం తహసీల్దారు త్రిభువన్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు చెరువుల నీటి మట్టం, కట్టల స్థితి, అలుగు పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో చెరువుల వద్ద భద్రతా చర్యలు మరింత బలపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడండి

జమ్మలమడుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్త కుండా అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ ఆదే శించారు. జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలో ప్రజలు విద్యుత్తు సరఫరా విషయంలో వంద శాతం సంతృప్తి వ్యక్తం చేసేలా సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. శుక్రవారం జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, కొండాపురం, ముద్దనూరు మండలాల్లో విద్యుత్తు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. అనంతరం జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థపై ప్రజాదరణ పెంపునకు కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్, అసిస్టెంట్ ఇంజనీర్లు వీరారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణ, చిదంబరరెడ్డి, ఆర్‌వీ ఈశ్వర్, జూనియర్ ఇంజనీర్లు, అకౌంట్స్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ముందుగా ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులకు దరఖాస్తు చేసుకున్నవారు 70 మందికి రూ.40.46 లక్షలు పంపిణీ చేశారు. అనంతరం భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం గండికోటలో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. గండికోట అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఎంతో కృషి చేశాడన్నారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పరుగుపెడుతోందన్నారు. రోడ్లు తదితర పనులు పూర్తికావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ మల్లికార్జున, పొన్నతోట శ్రీనివాసులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

'రాచమల్లు చీకటి ఒప్పందాలు బహిర్గత పరుస్తా'


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి ప్రతిపక్షంలోఉండి కూడా చీకటి ఒప్పందాలు చేసుకుంటూ అవినీతి పనులకు పాల్పడుతున్నారని వాటిని బహిర్గతం చేస్తానని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్ రెడ్డి ఓటమి నుంచైన గుణపాఠం నేర్చుకోకుండా ప్రజల పక్షాన పోరాడకుండా ఇప్పటికి అవినీతి రాజకీయాలు సాగిస్తున్నాడని మండి పడ్డారు. ప్రజల పక్షాన అధికార పార్టీలో వున్నా తాను పోరాడతున్నానని నన్ను అవమాన కరంగా మాట్లాడటం రాచమల్లు సంస్కార హీనతకు నిదర్శనమన్నారు. మా తల్లిదండ్రులు మాపార్టీ క్రమశిక్షణను నేర్పాయన్నారు.

'కారు యజమానిపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ కుమారుడి ఆటోను ఆక్సిడెంట్ చేసిన కారు యజమానిపై చర్యలు తీసుకోవాలని ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన వెంకటేష్ అనే బాధితుడు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ పోషణకోసం తన కుమారుడు శ్రీనివాస్ ఆటో నడుపుతున్నాడని ఈనెల 9వ తేదీ ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టిందని, దీంతో ఆటో బోల్తాపడి తన కుమారునికి కాలు విరిగి, కన్నుకు తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. తన కుమారున్నిమెరుగైన చికిత్స కోసం తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో చేర్చామని తెలిపారు. కారు యజమానిపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను కోరుతున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కారు యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.